క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన యోగాంజనేయస్వామి విగ్రహం

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గల సాగరేశ్వర ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ యోగాంజనేయస్వామి విగ్రహం సోమవారం అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. అనంతరం భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గీతం వీసీ దయానంద సిద్దవట్టం

కొమ్మాది : పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారతీయతను, దేశభక్తిని నిండుగా కలిగి నాయకత్వ లక్షణాలతో మొఘల్ దాడుల నుంచి మరాఠ ప్రాంతాన్ని రక్షించుకునేందుకు శివాజీ పోరాడారని వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం అన్నారు. ముందుగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతం అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రామాలయ ప్రారంభోత్సవం



ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారామ లక్షణ ఆంజనేయ విగ్రహాలు

ఆనందపురం : మండలంలోని వేములవలసలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాద్రి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా పురోహితుడు ఏచూరి రామ జోగారావు శర్మ ఆధ్వర్యంలో వేద పండితులతో ఆలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ప్రాతఃకాల అర్చనలు, మహా హోమం, మహా గణపతి పూర్ణాహుతి, వేదమంత్ర పుష్పం, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం మూడు వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలలితాపీఠం వార్షికోత్సవాలు

సీతంపేట : శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో 'అమృతోత్సవం' పేరిట ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న వేడుకలు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో మహా సంకల్పంతో ప్రారంభమయ్యాయి. కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో పూజలు చేశారు. సాయంత్రం దర్బారు హాలులో లలితా వైభవంపై కవి సమ్మేళనం నిర్వహించారు. తిరుమల పెద్దింటి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో 20 మంది కవులు లలితా అమ్మవారి విశిష్టతపై కవిత్వం చెప్పి అలరించారు. ముందుగా రచయిత డి.వి.సూర్యారావు రచించిన 'మన మహర్షులు' పుస్తకాన్ని పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, ఆచార్య బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. రాంభట్ల నృసింహశర్మ, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామి పాల్గొన్నారు.

గొప్ప విజనరీ సీఎం జగన్

- రాష్ట్రంలో 6 లక్షల మందికి ఉపాధి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ఘనంగా 'వలంటీర్లకు వందనం'



ప్రశంసాపత్రాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు



మధురవాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: గొప్ప విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అతని విజన్, గొప్పతనం, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్థం చేసుకోవడానికి 75 ఏళ్ల వయసున్న చంద్రబాబుకే ఐదేళ్లు పట్టిందన్నారు. 'వలంటీర్లకు వందనం' పేరుతో జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసే కార్యక్రమం మధురవాడలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాల వల్ల రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని, కేంద్ర బడ్జెట్ కూడా సరిపోదని గతంలో విమర్శించిన చంద్రబాబు... ప్రస్తుతం ఎన్నికలు సమీపించడంతో ఓట్ల కోసం అమలుకాని హామీలు ఇస్తున్నాడని మండిపడ్డారు. ప్రతిపక్షాల మాయ మాటలు, విమర్శలు ఎవరూ నమ్మొద్దన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థను నాశనం చేయడానికి అనేక కుట్రలు చేస్తున్నారని, అంతా అప్రమత్తంగా ఉండాని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్ యువత మీదే ఆధారపడి వుందని, భవిష్యత్‌లో యువ నాయకులను తయారు చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 6 లక్షల మందికి ఉపాధి కల్పించారన్నారు. అర్హులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా, అవినీతి లేకుండా అందిస్తున్నామన్నారు. వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. అనంతరం వలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ పాటలకు వలంటీర్లు డ్యాన్సులు చేయగా వారితో కార్పొరేటర్ అప్పారావు, ఇతర నాయకులు కలిశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారిని ప్రోత్సహించారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, ఏపీడీ గంగాధర్, 5, 6, 7, 8 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, వివిధ విభాగాల నాయకులు వంకాయల మారుతీ ప్రసాద్, పిళ్లా సూరిబాబు, జగ్గపల్లి నరేష్, రాయిన సాయి, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, జేఎస్ రెడ్డి, సియాద్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

చిల్లపేట చెరువు అభివృద్ధిపై జెడ్సీ ఆరా



చిల్లపేట చెరువు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

తగరపువలస : చిల్లపేట చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులపై భీమిలి జెడ్సీ కనకమహాలక్ష్మి సోమవారం ఆరా తీశారు. చెరువు గట్టు బ్యూటిఫికేషన్ పనులపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. చెరువు అవుట్‌లెట్‌లు ఎందుకు మూసి ఉన్నాయని ఏఈ సుమన్‌ను అడిగి తెలుసుకున్నారు. చెరువు విస్తీర్ణం, ఆక్రమణలపై జీవీఎంసీ సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. చెరువును ఆనుకుని ఉన్న ఎండోమెంట్ భూముల వివరాలు తెలుసుకున్నారు. చెరువును ఆనుకుని సాగులో ఉన్న రైతులు తమ వివరాలతో కార్యాలయానికి వచ్చి కలవాలన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ శివశక్తినగర్ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు శివశక్తినగర్ రోడ్డు, అయ్యప్పనగర్, వైఎస్సార్ కాలనీ, గాయత్రి హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వినియోగదారులు గమనించి, సహకరించాలని రామమూర్తి కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే దళితులకు న్యాయం



వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణను సన్మానిస్తున్న నాయకులు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో దళితులకు న్యాయం జరిగిందని ఆ పార్టీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ అన్నారు. మాజీ కౌన్సిలర్ జీవీ రమణకు ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి లభించిన సందర్భంగా సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు గాడు వెంకటప్పడు, కోరాడ వెంకటరావు, బోని బంగారు నాయుడు, అక్కరమాని రామునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, సరగడ రఘునాథరెడ్డి, కదిరి ఎల్లాజీ, బొడ్డు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మూడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నేడు

మహారాణిపేట: 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడతలో భాగంగా మంగళవారం భీమిలి మండలం అమనాం, పద్మనాభం మండలంలో రేవిడి, ఆనందపురం మండలంలో పాలవలస గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, డెంటల్ వైద్యులు శిబిరాలకు వస్తారని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు సూచించారు.

పాఠశాల కిటికీ గ్రిల్ పడి విద్యార్థికి గాయాలు





ఎంఈవో పద్మావతితో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు (ఇన్‌సెట్) గ్రిల్ ఊడిపోయిన కిటికీ

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాల కిటికీ గ్రిల్ జారిపడి ఆదివారం ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచగా మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన వివేక్ ఇక్కడ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అతడిని చూడడానికి వివేక్ అక్క నందిని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చింది. ఆమె పాఠశాల నుంచి తిరిగి వెళ్తుండగా పాఠశాల నాలుగో ఫ్లోర్‌లో ఉన్న కిటికీ గ్రిల్ ఊడి నందిని తలపై పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో సంగివలసలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న నందిని తండ్రి భాస్కర రావు, మరికొంత మంది పాఠశాలకు చేరుకొని సంఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. స్థానిక పోలీసులకు ఆస్పత్రి వర్గాల వారు విచారణ నిమిత్తం సమాచారం అందించారు.

ఎంఈవో విచారణ

ఆనందపురం ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి మంగళవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. గ్రిల్ ఊడిపడిన కిటికీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న హాస్టల్ గదుల కిటికీల గ్రిల్స్ అన్నీ బలహీనంగా ఉన్నాయని వెల్లడించారు. కిటికీలకు ఉన్న అన్ని గ్రిల్స్‌ను సరిచేసేంత వరకూ ఆ ఫ్లోర్‌లో హాస్టల్ నిర్వహించరాదని ఆదేశాలిచ్చారు. సంఘటనపై శాఖాపరమైన విచారణ జరిపి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

అకారణంగా గాయాలు పాలైన విద్యార్థి కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం ఆదుకోవాలని ఏబీవీపీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల నిర్వహిస్తున్న గదులు అస్తవ్యస్తంగా ఉన్నాయని భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటన విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం ఉందని నందిని కుటుంబ సభ్యులు మాత్రం కేసు అక్కరలేదని తెలిపి నందిని సొంత గ్రామానికి తీసుకొని వెళ్లిపోయినట్టు తెలిపారు.

అక్రమ బడ్డీలు తొలగించాలని వినతి

మధురవాడ : సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్ ద్వారా తక్షణ చర్యలు చేపడతామని జోన్ – 2 సూపరింటెండెంట్ అప్పలరాజు చెప్పారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా 8 అర్జీలు అందాయి. తమ సొంత స్థలం మధురవాడ సర్వే నంబరు 52/8 వద్ద అనధికార వ్యక్తులు అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు తొలగించాలని సంధ్య, జోడుగుళ్లపాలెంలో తన స్థలం వద్ద అనధికారికంగా వేసిన రేకుల షెడ్ తొలగించాలని ఎస్.మల్లేశ్వరరావు కోరారు. కొమ్మాదిలో తమ స్థలంలో ఇంటి నిర్మాణం నిమిత్తం ప్లాన్‌కు అనుమతి కోరగా రూ. 35 వేలు కట్టాలని సచివాలయ సిబ్బంది చెప్పారని, ఆ డబ్బులు కడతామంటే సదరు మొత్తం కట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని కొమ్మాదికి చెందిన కె.సింధుజ ఫిర్యాదు చేశారు.

జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెం ఎంఐజీ – 20 వద్ద వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కె.బాబూరావు, కొమ్మాది జంక్షన్ సమీప వికలాంగుల కాలనీ వద్ద సెప్టిక్ ట్యాంక్ లీకై ఇళ్లు పాడైపోతున్నాయని, చర్యలు చేపట్టాలని బి.నాగమణి కోరారు. మధురవాడ సంపత్‌నగర్ వద్ద మురుగు నీరు వెనక్కు వస్తోందని చలమాజీ హైట్స్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రత్న కుమారి, తదితరులు వాపోయారు.

'లోకేష్‌కు కనీస జ్ఞానం లేదు'



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేష్ చేసిన విమర్శలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల గుడ్డలు, కళ్లకు గంతలు కట్టుకుని సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ కనీస జ్ఞానం లేకుండా లోకేష్ మాట్లాడుతున్నాడన్నారు. నవరత్నాల పేరుతో పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. గతంలో టీడీపీ హయాంలో పాలకులు కోట్లాది రూపాయలు దోచుకున్నారు తప్ప ప్రజలకు మేలు చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవా, అభివృద్ధి పనులు చేస్తున్నారని, వాటిని టీడీపీ నాయకులు కళ్లతో చూసి మాట్లాడాలని సూచించారు. యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంతోపాటు ఉద్దానం కిడ్నీ బాధితులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నీటి సదుపాయం కల్పించి, ఆస్పత్రి నిర్మించిన విషయం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో ఒక్క మంచి పనీ చేయకుండా నోటికొచ్చినట్టు వాగితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నాయకులు ముక్కి కృష్ణ, కొంకి వెంకటేష్, ప్రగడ చంటి, అప్పికొండ బాలకృష్ణ, చందక రాజశేఖర్, కుమార్, భాను పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పద్మనాభం : మండలంలోని కొత్త కొవ్వాడ సంస్కృతి పాఠశాల విద్యార్థులు 14 మంది విజయనగరం జిల్లా లక్కవరపుకోటలో విక్టరీ షుకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ వాడపల్లి సాయి కృష్ణంరాజు సోమవారం అభినందించారు. ఎల్.జస్విత, ఎస్.లోసిక బ్రౌన్ బెల్టులు, ఎన్.జనార్దననాయుడు, జి.రాజేశ్వరి అనన్య గ్రీన్ బెల్టులు, మరో ఇద్దరు ఆరంజ్, ఎనిమిది మంది పసుపు బెల్టు సాధించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రామరాజు, ప్రిన్సిపాల్ ఎం.జగదీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా డిజిటల్ విద్యా బోధన

భీమునిపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ విద్యను విద్యార్థులకు అర్థమయ్యేలా జాగ్రత్తగా బోధించాలని స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద రెండు రోజులపాటు జోనల్, మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యాబోధన, స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌ల వినియోగంపై సోమవారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయని, అందుకు అనుగుణంగా బోధించాలని సూచించారు. విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో ప్రయోజనకరంగా వుంటుందన్నారు. పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ఏర్పాటు, విద్యార్థులకు ట్యాబ్‌లు అందివ్వడంతో వాటిని సద్వినియోగం చేసుకుంటూ బోధించాలని సూచించారు. మండల విద్యా శాఖ అధికారులు శివరాణి, జయప్రద, ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం, రిసోర్స్‌పర్సన్లు రెడ్డిపల్లి అప్పలరాజు, నజ్మాసుల్తాన పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లతో బోధన సామర్థ్యం మెరుగు

పద్మనాభం : స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణతో బోధన సామర్థ్యం పెరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి పి.రమణ అన్నారు. పద్మనాభం, ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు 50 శాతం మందికి సోమవారం స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులు తమ బోధన అనుభవాలు పంచుకోవడం వల్ల భవిష్యత్‌లో మరింత మెరుగ్గా బోధించవచ్చన్నారు. బేస్ లైన్, మిడ్ లైన్ గ్రేడింగ్ అప్ టూ డేట్‌గా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు.

కార్యక్రమాల్లో ఆర్‌వీపురం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వి.శంకరరావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ అందుబాటులో 'సౌకర్యం' కేంద్రం

మధురవాడ : మహా నగర పాలక సంస్థలో పని దినాలతోపాటు ఆదివారం సహా అన్ని సెలవు రోజుల్లోనూ జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లోని సౌకర్యం కేంద్రం పనిచేస్తుందని జోనల్ కమిషనర్ శైలజవల్లి సోమవారం ఓ ప్రకటనలో చెప్పారు. కేంద్రం రోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పనిచేస్తుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కూల్చేసిన చోటే.. మళ్లీ నిర్మాణాలు

- ఆక్రమణదారుల చర్యలతో స్థానికుల విస్మయం
- అనుమానాస్పదంగా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు



సంగివలస సర్వే నంబర్ 90లో నిర్మించిన దుకాణాలు



జనవరి 10న టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చేసిన దుకాణాలు



ప్రస్తుతం సంగివలసలో షట్టర్లు బిగించి నిర్మించిన దుకాణాలు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న ఆక్రమణదారుల చర్యలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. ఒకసారి అక్రమ నిర్మాణంగా నిర్ధారించి టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారు. భీమిలి టౌన్‌తోపాటు సంగివలసలో జరుగుతున్న ఈ సంఘటనలు స్థానికులను నివ్వెరపరుస్తున్నాయి. మరోవైపు అక్రమ నిర్మాణదారులతో జీవీఎంసీ అధికారులు లాలూచీ పడుతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులు డబ్బులు ఇవ్వకపోతే అక్రమ నిర్మాణమని కూల్చేసిన అధికారులే... తర్వాత డబ్బులు తీసుకుని అటువైపు చూడటం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

- జీవీఎంసీ రెండో వార్డు సంగివలస – పాండ్రంగి రహదారిలో సర్వే నంబర్ 90లో 391.8 చదరపు గజాల స్థలంలో షాపులు నిర్మించిన ఓ వ్యక్తి తర్వాత ఆ రహదారిని ఆక్రమించి పక్కనే మూడు దుకాణాలు నిర్మించాడు. ఇవి అక్రమ నిర్మాణాలుగా గుర్తించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది గత నెల 10న షట్టర్లతో సహా కూల్చివేశారు. ప్రస్తుతం మళ్లీ కూల్చేసిన చోటే రెండు దుకాణాలు, షట్టర్లు కొత్తగా నిర్మించారు. దీని కోసం ఆక్రమణదారుడు రూ.30 వేలు అధికారులకు సమర్పించుకున్నట్టు తెలిసింది.
- భీమిలి టౌన్ 3వ వార్డు బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని ఆనుకుని గతేడాది నవంబరులో ఒక వ్యక్తి ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టాడు. సదరు నిర్మాణం కూల్చకుండా టౌన్ ప్లానింగ్ విభాగం తరఫున భీమిలి టాక్స్ పేరుతో రూ.50 వేలు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వినిపించాయి. సదరు వ్యక్తి అంత మొత్తం ఇచ్చుకోలేకపోడంతో కక్ష కట్టిన అధికారులు ఆ నిర్మాణాన్ని కూల్చివేయించారు. దీంతో నష్టపోయిన తర్వాత తేరుకున్న సదరు వ్యక్తి రూ.30 వేలు సమర్పించుకోవడంతో అక్రమ నిర్మాణం జరిగిన చోటే మళ్లీ అనుమతులు ఇవ్వడంతో నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. భీమిలి జోన్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు కొంత మేర పరిణితి చెంది నేరుగా డబ్బులు వసూలు చేయకుండా మధ్యవర్తులను ఏర్పాటు చేసుకోవడం, ఫోన్ పే ద్వారా స్వీకరించడం వంటి కొత్త విధానాలకు తెరతీశారని తెలుస్తోంది. గతంలో అక్రమ నిర్మాణం పేరుతో కూల్చివేసిన చోటే మళ్లీ నిర్మాణాలు చేపడుతుండడంపై భీమిలి జెడ్సీ కనకమహాలక్ష్మి వివరణ కోరగా... టౌన్ ప్లానింగ్ రికార్డులు సరిచూసి ఏసీపీ శ్రీనివాసరావు ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఎంవీపీ కాలనీ: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరం ఎంతైనా ఉందని ద్వారకా క్రైమ్ ఏసీపీ వెంకటరావు అన్నారు. ద్వారకా జోన్ పరిధిలోని సీతమ్మధార, ఎంవీపీ కాలనీల్లో ఉన్న నిర్మాణ భవనాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ప్రత్యేక పాత్ర పోషిస్తాయన్నారు. వీటిని ప్రతి ఇల్లు, వాణిజ్య సముదాయం ఆవరణంలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలు జరిగేందుకు సైతం ఆస్కారం ఉండదన్నారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందస్తు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ దిశగా యాజమాన్యాల్లో అవగాహన పెంచాలని ద్వారకా క్రైమ్ సీఐ శ్రీనివాసరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజు, పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించి పైప్‌లైన్ నిర్మిస్తున్నారని ఆందోళన



సంగివలస వైఎస్ రాజశేఖరరెడ్డి కాలనీ శివారులో ఇంటి ముందు నుంచి మురుగు పైప్‌లైన్, ప్రహరీ

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి కాలనీలో 20 అడుగుల రహదారిని ఆక్రమించి ప్రముఖ విద్యాసంస్థ భారీ మురుగు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడంతో... మాజీ కౌన్సిలర్ ఒకరు ప్రహరీ నిర్మిస్తున్నారని కోనాడ హేమలత అనే మహిళ ఆరోపించింది. దీని వల్ల సర్వే నంబర్ 12లోని కాలనీ శివారులో ఉన్న తన ఇంటికి రహదారి పూర్తిగా మూసుకుపోతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థకు చెందిన మురుగు పైపులైన్ జీవీఎంసీ పరిధిలో నుంచి తీసుకొచ్చి తాళ్లవలస పంచాయతీ పరిధిలో వదిలేశారని, దీనివల్ల ఇక్కడి బోరుబావులు, నేలబావులు, గోస్తనీ గెడ్డ కలుషితం అవుతుందన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం వలందపేట సర్వే నంబర్ 26/2లో ప్రహరీ నిర్మిస్తున్న 50 సెంట్ల స్థలం చిల్ల అప్పలరెడ్డి అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లతో విక్రయించాడని అదే గ్రామానికి చెందిన చిల్ల సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. ఈ భూమి విషయంలో న్యాయస్థానంలో వివాదం నడుస్తుండగా విద్యాసంస్థ మురుగునీటి పైప్‌లైన్ నిర్మాణంపై ఈ నెల 12న కలెక్టరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేశామని తెలిపారు.